సోలార్ ప్రాజెక్టును పూర్తి చేయాలి

- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూఖీ
- కొండారెడ్డిపల్లి పైలట్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ సంతోష్, విద్యుత్ శాఖ అధికారులతో గూగుల్ మీట్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24: కొండారెడ్డిపల్లిలో సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్, విద్యుత్ శాఖాధికారులను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్, విద్యుత్ అధికారులతో కొండారెడ్డిపల్లి సౌర విద్యుత్ పనులపై గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి విద్యుత్ శాఖాధికారులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా, పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసిన కొండారెడ్డిపల్లిలో అధికారులంతా అందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాను కూడా త్వరలో గ్రామాన్ని సందర్శిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ గ్రామంలో సోలార్ విద్యుత్‌పై కొనసాగుతున్న పనులను సీఎండీకి వివరించారు. కొండారెడ్డిపల్లిలో గృహ అవసరాలకు 499 సర్వీస్ కనెక్షన్లు, వాణిజ్య అవసరాలకు 66 సర్వీస్ కనెక్షన్లు, పరిశ్రమలకు 10 సర్వీస్ కనెక్షన్లు, వ్యవసాయ కనెక్షన్లు 867, విద్యుద్దీపాలకు ఏడు కనెక్షన్లు, విద్యకు సంబంధించి రెండు కనెక్షన్లు ఉన్నట్లు వివరించారు. వీటన్నింటికీ కావాల్సిన ఓల్టేజీ, దానికి తగ్గ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు, గృహ సముదాయాలు, కుటుంబాల వారీగా పేర్ల నమోదు తదితర అంశాలను మూడు రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రథమంగా కొండారెడ్డిపల్లిలో సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, కాలుష్య రహిత, పర్యావరణహిత ఇంధన వినియోగంలోకి తీసుకొచ్చే పనులను అధికారులు అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సోలార్ ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని వంగూరు తాసీల్దార్‌కు సూచించారు. సమావేశంలో కొండారెడ్డి గ్రామాభివృద్ధి నోడల్ అధికారి డాక్టర్ రమేశ్, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీపీవో రామ్మోహన్‌రావు, విద్యుత్ డీఈ శ్రీధర్‌శెట్టి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీసీకి హాజరైన కలెక్టర్ సంతోష్, విద్యుత్ శాఖ అధికారులు

పంటలసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- డాక్టర్ షేక్ మీరా, నాబార్డు చీఫ్ జనరల్ సుశీల

ప్రదర్శన భవనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ షేక్ మీరా

బిజినేపల్లి, సెప్టెంబర్ 24: రైతులు పంటలు పండించడంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ షేక్ మీరా, నాబార్డు చీఫ్ జనరల్ సుశీల అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం కృషివిజ్ఞాన కేంద్రంలో సమగ్ర వ్యవసాయం, ప్రదర్శనశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న, సన్నకారు రైతులు సమగ్ర వ్యవసాయాన్ని చేపడితే అధిక ఆదాయం పొందిన వారి ఆర్థిక పరిస్థితులు మెరుగు పడతాయన్నారు. సహజ వనరులను కాపాడుకోవచ్చన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగిస్తే అధికదిగుబడి పొందచ్చని సూచించారు. జిల్లాలో వర్షాధారంపైనే పంటలు ఎక్కువగా సాగు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలపై దృష్టిసారించాలని, అందుకు నాబార్డు నుంచి రుణాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. కృషివిజ్ఞాన కేంద్రం ద్వారా ఎంతో మంది రైతులకు శాస్త్రవేత్తలు సేవలందించడంపై కొనియాడారు. అనంతరం వివిధ పంటల సాగు, చీడపీడల నివారణ వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జమునా రాణి, ఏడీఆర్ మల్లారెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్, అసోసియేషన్ డీన్ పుష్పావతి, శాస్త్రవేత్తలు, రైతులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/బిజినేపల్లి, సెప్టెంబర్ 24: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, విద్యతోపాటు క్రీడలు ముఖ్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్య తోపాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకొస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి నియోజకవర్గం పేరు ప్రతిష్టలు జాతీయస్థాయిలో తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, అందుకు కావాల్సిన అవసరాలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనేక మంది క్రీడల్లో రాణించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ప్రతిభను చాటాలని కోరారు. అలాగే బిజినేపల్లి మండల కేంద్రంలోని పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఊర్కొండను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ.సెప్టెంబర్24: నియోజకవర్గంలో ఊర్కొండ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆయాగ్రామాల నాయకులతో కలిసి ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇప్పప హడ్‌పాఠశాలలో విద్యార్థుల ఉచిత బూట్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి రూ.వంద కోట్లతో కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మండల కేంద్రానికి ఇండోర్ స్టేడియం మంజూరు చేశామని, అన్నిగ్రామాల్లో మట్టి రోడ్డులను బీటీలుగా మార్చడానికి సుమారు రూ.60 కోట్లతో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు ఉచిత బూట్ల పంపిణీని తన సొంత నిధులతో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బొమ్మరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో పాల్గొని చిన్నారికి అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంఈవో, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఈజీఎస్ అవినీతిపై అంబుడ్స్‌మన్ విచారణ

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 24: మండలంలోని తర్నికల్‌లో గతేడాదికి సంబంధించిన ఈజీఎస్ పనుల్లో చోటు చేసుకున్న అవినీతిపైన పీడీ ఆదేశాల మేరకు జిల్లా అంబుడ్స్‌మన్ జంగయ్య మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో గతేడాది ఈజీఎస్ కూలీలకు చాలామందికి కూలి డబ్బులు రాలేదని గ్రామానికి చెందిన కూలీలు పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మెన్ మాట్లాడుతూ.. ఈజీఎస్ పనులకు సంబంధించి ఏటా కూలీలకు పనుల పై అవగాహన కల్పించాల్సి ఉండగా.. ఒక్క సమావేశం నిర్వహించలేదన్నారు. ఈజీఎస్ పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని కచ్చితంగా పనులు నిర్వహిస్తే రికార్డు చేయాల్సిందేన్నారు. గ్రామంలో విచారణ చేయబోతున్నట్లు వారం రోజుల క్రితమే నోటీసులిచ్చినా అధికారులు హాజరుకాకపోవడం సరైందికాదన్నారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు వస్తే వాటిని అంబుడ్స్‌మన్ వ్యవస్థ ద్వారా అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తుందన్నారు. తర్నికల్‌లో జరిగిన అవినీతిపైన ఎంపీడీవో వెంటనే స్పందించి వాటికి సంబంధించిన రికార్డులు తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. విచారణలో ఈజీఎస్ ఏపీవో, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

BUSINESS OFFER
★ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలి

- అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబర్ 24: పరిసరాల శుభ్రత కాపాడుకోవడమే కాకుండా స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు కూడా ఆరోగ్య పరిరక్షణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వగా ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని బాలికల పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ నరేశ్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, పురపాలక, మెప్మా సిబ్బంది, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట పట్టణంలో..

అచ్చంపేట టౌన్, సెప్టెంబర్ 24: పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కార్మికులు పట్టణ ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త గురించి మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని లింగాల చౌరస్తాలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్, కమిషనర్, విద్యార్థులు

అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు

కరాటేలో విద్యార్థులకు గోల్డ్ మెడల్

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు కరాటేలో గోల్ మెడల్ సాధించారు. ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న సాయికీర్తన, అక్షయ, మంజుశ్రీ, శ్రీరామ్, బాలు, భరత్ గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలు తెలిపారు. అదేవిధుగా కొల్లాపుర్‌లో డివిజన్ స్థాయి ఎస్ఎఫ్‌జీ పోటీల్లో జిల్లాస్థాయి బహుమతులను సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్

కల్వకుర్తిరూరల్, సెప్టెంబర్ 24: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని వైఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్యగౌడ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని వైఆర్ఎం కళాశాలలో డిగ్రీ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత చిత్రపటం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని తమ కళాశాల, తల్లితండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్య, అధ్యాపకులు, డిగ్రీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తున్న సీడీపీవో భాగ్యమ్మ

వంగూరు, సెప్టెంబర్ 24: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో భాగ్యమ్మ సూచించారు. మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ అభియాన్ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోష్టికాహారం, చిరుధాన్యాలతో చిన్నారిని ఎత్తుకున్న అమ్మపాటోను ఏర్పాటు చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రంలో లభించే పౌష్టికాహారం, చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుధాకర్, సూపర్‌వైజర్ వెంకట్రామమ్మ, దేవమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలోని శ్రీపురం రోడ్డున బీసీ కాలనీలో మంగళవారం చోటు చేసుకున్నది. బీసీ కాలనీలో నివాసముంటున్న పూసల సాయి (25) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని జనరల్ దవాఖానకు తరలించారు.

వేధింపుల కేసు నమోదు

బల్మూరు,సెప్టెంబర్ 24: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి మంగళవారం తెలిపారు. వనపర్తి జిల్లా శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తిరుపతయ్యలో రాధకు మూడేండ్ల కిందట వివాహమైంది. ఆగస్టు 31న అదనపు కట్నం, బంగారం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తూ.. చేతులకు గాయాలయ్యే విధంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కొల్లాపూర్ డివిజన్‌లో మోస్తరు వాన

కొల్లాపూర్, సెప్టెంబర్ 24: కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు మోస్తరు వాన కురిసినట్లు తాసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తెలిపారు. కొల్లాపూర్ మండలంలో 20.0 మి.మీ, కోడేరు మండలంలో 23.6 మి.మీ, పెద్దకొత్తపల్లి మండలంలో 13.2 మి.మీ, పెంట్లవెల్లి మండలంలో 19.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. కొల్లాపూర్ డివిజన్ వ్యాప్తంగా 76.6 మి.మీ వర్షపాతం నమోదైందని తాసీల్దార్ తెలిపారు.

ఉప్పొంగిన పెద్దవాగు

ముక్కిడిగుండం వద్ద ఉధృతంగా పారుతున్న పెద్దవాగు

మండలంలోని నార్లాపూర్–ముక్కిడిగుండం మధ్యలో పెద్దవాగు మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి ఉప్పొంగింది. వర్షాలు వచ్చిన ప్రతిసారి పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో ముక్కిడిగుండం ప్రజలు కొల్లాపూర్ వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పెద్దవాగుపై వంతెన నిర్మిస్తుండగా.. ప్రభుత్వ మార్పుతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉండిపోయింది. ప్రభుత్వం వెంటనే పెద్దవాగుపై నిలిచి పోయిన వంతెన నిర్మాణాన్ని చేపట్టి రాకపోకలకు అనుకూలం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ డిమాండ్ చేశారు.

గేదె కళేబరం లభ్యం

కోడేరు సెప్టెంబర్ 24: మండలంలోని బావాయిపల్లికి చెందిన కుర్మయ్య గేదె రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి వాగులో కొట్టుకుపోయి మంగళవారం కళేబరంతో లభ్యమైందని గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులు కిందట మేతకు వెళ్లిన గేదె సాయంకాలం ఇంటికి వస్తుండగా వాగులో కొట్టుకు పోయింది. మంగళవారం గ్రామానికి సమీపంలోని వాగులో కొంత దూరాన గేదె కళేబరం కనిపించడంతో దగ్గరికెళ్లి గుర్తించారు.

పొగాకు ఉత్పత్తులను నియంత్రించాలి

- డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 24: పొగాకు ఉత్పత్తుల నియంత్రణలో యువత భాగస్వామ్యం కావాలని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి సూచించారు. జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగనూలు కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి వెంకటదాసు, ప్రోగ్రామ్ అధికారి కృష్ణమోహన్, టీకా అధికారి రవికుమార్, డీపీవో రేణయ్య, వైద్యులు నారాయణస్వామి, సూపర్‌వైజర్లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 24: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని.. దీంతో ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పాటు చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొగాకు రహిత యువతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యుడు ఇస్మాయిల్, ఫార్మాసిస్ట్ బాలరాజు మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులైన గుట్కా, పాన్‌మసాలాలు, జర్దా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దీనివల్ల నోటి, గొంతు క్యాన్సర్లు వస్తాయన్నారు. యువత మొదట సరదాగా అలవాటు చేసుకుని, దానికి బానిసగా మారుతారన్నారు. వీటికి దూరంగా ఉండడంతోపాటు, సహచరులను దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ, దవాఖాన సిబ్బంది మునికుమారి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన నిషేధంపై అవగాహన

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ధూమపానం అలవాట్లపై అవగాహన కల్పించారు. సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాసులు, లక్ష్మీనర్సింహ గౌడ్ భాగ్యమ్మ, చెన్నయ్య, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ శుద్ధజలం అందించాలి

- ఈఈలు శ్రీధర్‌రావు, సుధాకర్‌సింగ్

లింగాల/బల్మూర్, సెప్టెంబర్ 24: ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం లింగాల, బల్మూర్ రైతు వేదికల్లో ఆయా మండలాల వాటర్‌మెన్‌లకు డీఈ హేమలత ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈలు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కలుషిత నీటిని తాగడంతో ప్రజలు మలేరియా, టైఫాయిడ్ తదితర రోగాలబారిన పడి దవాఖానల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవారన్నారు. తెలంగాణ అవతరణ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. వాటర్‌మెన్‌లు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమయానుకులంగా నీటిని విడుదల చేయాలన్నారు. నాలుగు రోజుల పాటు చేతిపంపులు బాగు చేయడం, వాటర్ ట్యాంకును ఏ విధంగా శుభ్రపర్చాలి తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి విడుతలో జిల్లాలోని నాలుగు మండలాల్లో వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో, ఏఈలు బాలరాంనాయక్, మధుబాబు, సందీప్, ఆంజనేయులు, నాయకులు వెంకటరెడ్డి, శ్రీపతిరావు, ఖదీర్, నర్సింగ్‌రావు, వెంకటయ్య, రమేశ్, కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు

'రుణమాఫీ బూటకం'

వంగూరు, సెప్టెంబర్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందనేది ఒట్టి బూటకమని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్‌రావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే సగానికి పైగా రైతులకు మాఫీ కాలేదని, ఒకపక్క రైతులకు రుణమాఫీకాక, పంట రుణాలను పొందలేక చాలామంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని ఆరోపించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ అందని రైతులు మండలంలో వేలల్లో ఉన్నా వారి బాధలు తీర్చే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2లక్షల పైబడి రుణాలు ఉన్న రైతుల నుంచి డబ్బులు కట్టించుకున్న ప్రభుత్వం వారికి ఖాతాలో ఇంతవరకు మాఫీ నిధులు జమ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ ఏయాలని డిమాండ్ చేశారు.

తిమ్మాజిపేట పీహెచ్‌సీ ఎదుట బీఆర్ఎస్ నిరసన

తిమ్మాజిపేట,సెప్టెంబర్ 24: పీహెచ్‌సీలో వైద్యులు లేరు.. మందులు సరిగ్గా లేవు.. రోగులు ఇబ్బందులకు గురువుతున్నారు.. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట పీహెచ్‌సీలో సరైన మందులు, వైద్యులు లేరని మంగళవారం పీహెచ్‌సీ ఎదుట బీఆర్ఎస్ మండల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జోగుప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. జూలై నుంచి పీహెచ్‌సీలో వైద్యులు లేరని, ఆయుష్ డాక్టర్ రోగులను పరీక్షిస్తున్నారని, రోగులకు ఏమైనా ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పీహెచ్‌సీలో ఇంజక్షన్లు ఇచ్చేందుకు సిరంజీలు లేవని, రోగులు ప్రైవేట్ మెడికల్ దుకాణాల నుంచి తీసుకురావాల్సి ఉందన్నారు. దీంతోపాటు కొన్నిరకాల మందుల కొరత ఉందన్నారు. పీహెచ్‌సీలో విధులకు సిబ్బంది ఆలస్యంగా వస్తున్నారని ఆరోపించారు. మండలంలో ఆయా గ్రామాల్లో ప్రజలు చికున్‌గున్యా, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నారని, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందుల కొరతపై సిబ్బందితో మాట్లాడగా.. పైనుంచే మందుల కొరత ఉందని తెలిపారు. పీహెచ్‌సీలో పరిస్థితులను చక్కదిద్దకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ విషయంపై మాజీ ఎంపీపీ జిల్లా ఉప వైద్యాధికారితో ఫోన్లలో మాట్లాడేదుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, హుస్సేనీ, వెంకటేశ్, రవి, శివ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పంటరుణాలివ్వాలని రైతుల ధర్నా

పీఎన్‌బీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 24: మాఫీ రుణాలను వెంటనే రెన్యువల్ చేయకుండా, పంట రుణాలను మంజూరు చేయకుండా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతులు మండలంలోని పెద్దకారుపాముల బ్రాంచ్ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు భీమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు రైతులకు రుణాలు మంజూరు చేయకుండా రెండునెలల నుంచి బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు ఎలాంటి సదుపాయాలు లేకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే కొత్త రుణాలు ఇవ్వకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులతోపాటు శివరాజు, కృష్ణమోహన్, లింగస్వామి, వెంకటస్వామి, వంశీ, అంజి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.